క్లుప్తంగా

విధిగా ఆస్తిపన్ను చెల్లించాలి



ఆస్తిపన్ను స్వీకరిస్తున్న జీపీ కార్యదర్శి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ విధిగా ఆస్తి పన్ను చెల్లించాలని కుల్కచర్ల గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం జీపీలో పలువురు గ్రామస్తుల నుంచి ఇంటి పన్ను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటి యజమానులు, దుకాణ దారులు తప్పనిసరిగా తమ ఇంటి, దుకాణ సముదాయాల పన్నులను సకాలంలో చెల్లించి, గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

నర్మదకు బీఎస్పీ టికెట్

బొంరాస్‌పేట: బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్పీ) టికెట్ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మదకిష్టప్పకు దక్కడం హర్షణీయమని ఆ పార్టీ దుద్యాల మండల నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నర్మద కిష్టప్పకు కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. జనరల్ స్థానం కావడంతో మహిళగా గెలిస్తే చరిత్ర సృష్టించిన ట్లేనన్నారు. ఈ సందర్భంగా పార్టీ బొంరాస్‌పేట మండల నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

యాలాల: దేవనూరు గ్రామానికి చెందిన మాసుల గోరేమియా ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు రాజేందర్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు ఖాసిం, వడ్ల శ్రీనివాస్‌చారీ, ఖలీల్, చాంద్‌పాష, శ్రీశైలం, నగేష్, అంజి, నవీన్, లాలు, మహ్మద్, మహేశ్ ఉన్నారు.

మండల సమావేశం వాయిదా

కొడంగల్: సోమవారం ఉదయం 11 గంటలకు జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశంలో కోరం లేక మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశామని, 2 గంటల తర్వాత కూడా సభ్యులు రాకపోవడంతో నిరవధికంగా వాయిదా వేసినట్లు ఎంపీడీఓ పాండు తెలిపారు.


కార్మికులకు అండగా ఉంటాం

తాండూరు టౌన్: సమస్యలపై పోరాటానికి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు అండగా ఉంటామని తెలంగాణ జన సమితి కౌన్సిలర్, టీఎంయూ డిపో గౌరవ అధ్యక్షుడు సోమశేఖర్, సీఐటీయూ జిల్లా నాయకులు శ్రీనివాస్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, కార్మికులు, అధికారులకు మధ్య సమన్వయం లోపించడంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఈ సమస్యలను పరిష్కరించాలని సంస్థ ఆర్‌ఎం, డీఎంలకు కోరామని పేర్కొన్నారు. ఇందుకు సమ్మతించిన అధికారులు.. సమస్యలకు పరిష్కారం చూపారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, కార్మికులు సోమశేఖర్, శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలి

బొంరాస్‌పేట: వైద్య, ఆరోగ్య శాఖలో క్లస్టర్, మండల స్థాయిలో సేవలందిస్తున్న కాంట్రాక్టు ఎంపీహెచ్‌ఎస్ మహిళ(ఏఎన్‌ఎం)లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట కాంట్రాక్టు ఎంపీహెచ్‌ఎస్ ఏఎన్‌ఎంలు నిరసన వ్యక్తంచేశారు. ఏళ్లు గడుస్తున్నా పీఆర్‌సీ, ఏరియర్స్ ఇవ్వడం లేదన్నారు. ఇప్పటివైనా ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో మండలంలోని కాంట్రాక్టు ఎంపీహెచ్‌ఎస్ లీలావతి, పద్మ, అంజలి ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కుల్కచర్ల: వీరశైవలింగాయత్ సమాజం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి సోమవారం పలువురు భక్తులు విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన అంగడి వీరమణి రూ.5,100, చందు రూ.10వేలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు భక్తులు సహకరించడం అభినందనీయమన్నారు.

‘హస్తం’ వస్తే అందరికీ మేలు

- బీఆర్‌ఎస్‌లో పెరిగిన అవినీతి
- కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం
- తెలంగాణను అభివృద్ధి చేసుకుందాం
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నేతలు



పూడూరు: కంకల్‌లో ప్రచారం చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి తదితరులు

దోమ: జాతీయ పార్టీ కాంగ్రెస్ వస్తే అందరికీ మేలు జరుగుతుందని, పేదల అభ్యున్నతికి పాటుపడే పార్టీకి తెలంగాణ ప్రజలు అండగా నిలవాలని డీసీసీ అధ్యక్షుడు టీ.రామ్మోహన్ రెడ్డి సతీమణి ఉమారామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం దోమ మండలం మల్లేపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అవినీతి పెరిగిందని, కేసీఆర్‌ను సాగనంపి, కాంగ్రెస్‌ను ఆహ్వానించి తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని ఆమె చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో వస్తే ఆరు గ్యారంటీ పథకాల అమలుతో అర్హులందరూ లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి టీ.రామ్మోహన్ రెడ్డిని గెలిపించాలని ప్రజలను ఆమె కోరారు. పార్టీలో చేరిన వారిలో సొసైటీ డైరెక్టర్ సాయమ్మ, మాజీ ఉప సర్పంచ్ మల్లయ్య, నాయకులు శ్రీనునాయక్, హన్యనాయక్ తదితరులు ఉన్నారు.

అధికారం ఖాయం

పూడూరు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండల పరిధి కంకల్, పుడుగుర్తి, రేగడిమామిడిపల్లిలో ఇంటింటికి వెళ్లి పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వివరించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి పేరుకుపోయిందని ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపి, కాంగ్రెస్ అభ్యర్థి డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

రేవంత్ సమక్షంలో పలువురి చేరిక



పార్టీ కండువా కప్పుతున్న రేవంత్‌రెడ్డి

కొడంగల్: మండల పరిధి పలు గ్రామాల సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో చిట్లపల్లి సర్పంచ్ వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కమిటీ మాజీ అధ్యక్షుడు గోడల రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ట, చంద్రకల్ మాజీ సర్పంచ్ నరేందర్ తదితరులు పార్టీలో చేరారు. ఇందులో నందారం ప్రశాంత్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందులో డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు వీరేష్, సురేష్, జంగారెడ్డి, భూపతిరెడ్డి, అంజయ్య తదితరులు ఉన్నారు.

హస్తం గూటికి టీడీపీ నేత

పరిగి: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పరిగి నియోజకవర్గ సీనియర్ నాయకుడు మాజీ జెడ్పీటీసీ చంద్రయ్య రేవంత్‌రెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు సమయంలోనూ ‘దేశం’లో కొనసాగానని, అధినేత చంద్రబాబుతో దగ్గర సంబంధాలు ఉండటంతోనే ఇప్పటి వరకు ఉన్నానని తెలిపారు. ప్రస్తుతం పార్టీలో తగిన గుర్తింపు లేకపోవడం, ఇతరత్రా కారణాలతో కాంగ్రెస్‌లో చేరుతున్నాని ప్రకటించారు. పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు.

‘చేతి’కి మద్దతీయక్క!



ఓటెయ్యాలని అభ్యర్థిస్తున్న మాజీ సర్పంచ్

ధారూరు: అక్కా ఆకలి అవుతుంది. ఏం పెడతావ్ అంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ మాజీ సర్పంచ్ మహిళ ఇంటికి వెళ్లి ప్రశ్నించాడు. ఏం కావాలి అన్నా, చపాతీలు చేస్తున్నా, కూరతో కలిపి తినేయ్ ఆకలి తుగ్గుతుంది అంటూ ఆ అక్క బదులిచ్చింది. ఎన్నికల వేళ నాకు కావాల్సింది మీరు వేసే ఓటు అక్కా.. ఆ ఓటును చేతి గుర్తుకు వేసి కాంగ్రెస్‌ను బలపర్చి, ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరడంతో ఆమె ఆనందపడింది. ‘అదేం బాగ్యం కొడుకా, కారాయనకు ప్రజలపై కనికరం లేదు, కొత్తగా ఒక్క రేషన్‌కార్డు ఇచ్చింది లేదు. పిల్లలకు ఉద్యోగాలు లేవు. ఊర్లో ఏ పని చేసింది లేదు. మా బాగోగులు పట్టించుకోరు. కారుకు ఎందుకు ఓటేస్త. ఎనకటి నుంచి ఉన్న చేతికే నా ఓటు. నువ్వేం ఫికర్ జేయకు అన్నా’ అంటూ ఆ అక్క బదులిచ్చింది. ధారూరు మండలం ఎబ్బనూర్ గ్రామంలో సోమవారం.. బైండ్ల శోభ అనే మహిళ ఇంటి ఆవరణలో రొట్టెలు చేస్తుండగా.. మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి ఆమే వద్దకు వెళ్లి కాంగ్రెస్ తరపున ప్రచారం చేయగా.. ఈ ఆసక్తి కరమైన సంభాషన వారివురి మధ్య జరిగింది.

ఓటు వజ్రాయుధం

- ప్రలోభాలకు మొగ్గుచూపొద్దు
- సీఐ వెంకటరామయ్య



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

దోమ: ఓటు వజ్రాయుధం అని, ప్రలోభాలకు మొగ్గు చూపకుండా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని సీఐ వెంకటరామయ్య సూచించారు. సోమవారం దోమ మండలం గుండాల గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్‌ఐ రవిగౌడ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం సీఐ మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో భద్రత పటిష్టం చేశాని, పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల ఆవరణలో ఓటర్లకు అవసరమైన సదుపాయాలు, వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

నూతన నియామకం

దౌల్తాబాద్: మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దౌల్తాబాద్‌కు చెందిన మహిపాల్‌ను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి నియమించారు. ఈ మేరకు సోమవారం మహిపాల్‌కు నియామక పత్రం అందజేశారు. శాసనసభ ఎన్నికల్లో విస్తృతంగా పనిచేసి, పార్టీ గెలుపునకు కృషిచేయాని సూచించారు. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన తిరుపతిరెడ్డికి, మండల నాయకులు వెంకట్రావ్, వెంకట్‌రెడ్డి, వీరన్నలకు కృతజ్ఞతలు తెలిపారు.

పంటలను పీడిస్తున్న చీడపీడలు

- అందుబాటులో లేని వ్యవసాయ అధికారులు
- సలహాలు, సూచనలు ఇచ్చేవారు లేక రైతుల ఇబ్బంది



పూత దశలో కంది పంట

పెద్దేముల్: ఏ పంటకు ఏ మోతాదులో మందులు పిచికారీ చేయాలి? అనే సలహాలు, సూచనలు ఇచ్చే వ్యవసాయ అధికారులు అందుబాటులో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఎరువుల దుకాణాల యజమానులు చెప్పింది అనుసరిస్తూ పంట నష్టపోతున్నారు. వారం రోజుల నుంచి పత్తి, కంది పంటలకు చీడపీడలు ఆశించడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో పలువురు రైతులు మాట్లాడారు. ‘మండల వ్యవసాయ శాఖ అధికారి ఎక్కడ ఉంటారో తెలియడం లేదు. గ్రామాలకు నియమించిన ఏఈఓలు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో అర్థం కావటం లేదు’ అని చెప్పడం గమనార్హం. పెద్దేముల్ ఏఈ నజీరొద్దీన్ మండలానికి వారంలో రెండు రోజులు కూడా రావటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

డిమాండ్లు నెరవేర్చేవారికే మద్దతు

జైభీమ్ ఆర్గనైజేషన్ కమిటీ

తాండూరు టౌన్: తాండూరు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించే వారికే తమ మద్దతు ఉంటుందని జైభీమ్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక శాంతినగర్ పార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో ఐదు ఎకరాల స్థలంలో బుద్ధవనం ఏర్పాటు, నిరుద్యోగుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఎస్సీ శ్మశాన వాటిక కోసం స్థలం, ఎస్సీలకు కార్పొరేషన్ లోను, ఇళ్లు లేని వారికి స్థలంతో పాటు రుణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. వీటిని నెరవేర్చే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. ఇందులో సభ్యులు శివకుమార్, జుంటుపల్లి వెంకట్, జై సాయిప్రసాద్, జైనరేష్, శ్రీనివాస్, నర్సింహులు, విజయేందర్, ఎల్లప్ప, బాలరాజు, రఘు, జగదీష్, శాంతు, కన్న, జయరాజు ఉన్నారు.

మేకలు, గొర్రెలతో ఆర్థికాభివృద్ధి

మొయినాబాద్‌రూరల్: రైతులు మేకలు, గొర్రెల పోషణతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని మండల పశు వైద్యాధికారి దేవీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కనకమామిడిలో 1468 మేకలు, గొర్రెలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఈ టీకాల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. ప్రతి గ్రామానికి వెళ్లి నాలుగు నెలల పైబడిన మేకలు, గొర్రెలకు ఈ టీకాలు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని వెల్లడించారు. రైతులు మేకలు, గొర్రెల పెంపకదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూగ జీవాలను కాపాడుకోవాలి

షాబాద్: వ్యాధుల నుంచి మూగ జీవాలను రక్షించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశు వైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.

అదును దాటుతోంది.. నీరు వదలరాయే!

‘వేరుశనగ పంట సాగుకు అదును దాటుతోంది. కోటపల్లి జలాశయం నుంచి సాగునీటిని వదలండి సార్’ అని ప్రాజెక్టు ఆయకట్టు రైతులు నీటిపారుదల శాఖ అధికారులను వేడుకుంటున్నారు. సాధారణంగా అక్టోబర్ నెలలోనే విత్తనాలు నాటుతామని, కానీ నీటి జాడలేక ఇంత వరకు అడుగు ముందుకు వేయలేదని, అదును దాటుతోందని ఆవేదన చెందుతున్నారు.

- వేరుశనగ సాగుకు భూములు సిద్ధం
- పక్షం రోజులు దాటినా.. పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- సాగునీటి కోసం ఎదురు చేస్తున్న ఆయకట్టు రైతులు



వేరుశనగ సాగుకు భూములు చదును చేసిన ఆయకట్టు రైతులు

పెద్దేముల్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కోటపల్లి ప్రాజెక్టు తలమానికం. ఈ ప్రాజెక్టు కింద పెద్దేముల్, ధారూర్ రెండు మాండలాల పరిధి 19 గ్రామాలకు గాను 9,200 ఎకరాలకు సాగు నీరు అందవలసి ఉంది. కానీ నీరు సక్రమంగా అందడం లేదని ఆయకట్టు పరిసర ప్రాంత రైతులు ఆరోపించగా.. బిబి కెనాల్ ద్వారా కుడి, ఎడమ కాలువల నుంచి నాలుగున్నర వేల ఎకరాలకు సాగు నీటిని వదులు తున్నామని ఇరిగేషన్ అధికారులు లెక్కలు చూపటం గమనార్హం. ముఖ్యంగా కోటపల్లి కింద గ్యాంగ్ మెన్‌లు లేక, కాలువలు బాగాలేక నీరందటం లేదని ప్రాంత రైతులు చెప్పగా.. (డీ అండ్ ఎంఓ) ఆఫరేషన్ అండ్ మేయింటనెన్స్ కింద ప్రభుత్వం రూ.30లక్షలు మంజూరు చేసిందని, వాటి ద్వారా కాలువలకు మరమ్మతులు చేసి, నీటిని వదులుతున్నామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

జైకా నిధులేవి?

జైకా నిధులు వస్తున్నాయని కాంగ్రెస్ హయాంలో నాటి మంత్రి ప్రసాద్ రైతులకు చెప్పారని, కానీ నేటి వరకు వాటి జాడ లేదని రైతులు విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టు గురించి పట్టించుకునే వారు కరువయ్యారని, జలాశయం మరమ్మతులకు కనీసం రూ.50కోట్లకు పైగా నిధులు వెచ్చిస్తే ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చి, చివరి ఆయకట్టు వరకు సాగునీటి అంది, కష్టాలు తీరుతాయని పలువురు కర్షకులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ప్రాజెక్టు కింద గ్యాంగ్ మెన్‌లు లేక, కాలువలు శిథిలావస్థకు చేరి నీరు అందటం లేదని, జలాశయం సిబ్బంది కొరత తీర్చాలని కోరుతున్నారు.

సమయం దాటితే కష్టం



వేరు శనగ సాగు చేసేందుకు భూములు సిద్ధం చేసి ఇరువై రోజులు అయింది. కానీ ఇంత వరకు ప్రాజెక్టు నుంచి నీరు వదలలేదు. సంబంధిత అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పటం లేదు. సమయంలో సాగు చేస్తే దిగుబడి వస్తుంది. అదును దాటితే కష్టం. అధికారులు స్పందించి నీటిని వదలాలి.

– వెంకటేశం, రైతు, జనగాం

నిధులు మంజూరు చేయండి



ప్రాజెక్టు మరమ్మతుకు నోచుకోక ఏటా సాగు తగ్గుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జలాశయం మరమ్మతుకు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసి, చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే సాగునీరు సక్రమంగా అంది, పంటలు బాగా పండుతాయి.

– నల్ల వెంకటరెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ పెద్దేముల్

కాలువలు బాగుచేయిస్తం..



సాగు నీరు వదిలేందుకు వెంటనే కాలువలు బాగు చేయిస్తం. అదును దాటకుండా సమయానికి వేరుశనగ సాగుకు నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. రైతులు దిగులు చెందవద్దు. సిబ్బంది సమస్య కారణంగా ఇబందిగా ఉంది. నీరు వదిలిన సమయంలో రైతులు సహకరించాలి. ప్రాజెక్టు మరమ్మతుకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపాం.

– నవీన్, కోటపల్లి ప్రాజెక్టు ఏఈ

కాంగ్రెస్‌కు ఓటేస్తే కారుచీకట్లే

- ప్రజల విశ్వాసం కోల్పోయిన ‘హస్తం’
- అన్ని వర్గాల మేలుకోరే బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టండి
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు



పార్టీలో చేరిన వారితో మంత్రి, ఎమ్మెల్యే

యాలాల: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే.. రాష్ట్రంలో కరెంట్ కష్టాలు ఉత్పన్నమవుతాయని, చీకటి బతుకులు తప్పవని తాండూరు ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధి రాస్నం గ్రామంలో ఎమ్మెల్యే తల్లి, జెడ్పీటీసీ ప్రమోదినితో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదని, అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడే పార్టీ బీఆర్‌ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కృషితో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. రోహిత్‌ను మరోమారు గెలిపించాలని కోరారు. ఇందులో పార్టీ గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, మల్లారెడ్డి, రాంచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పలువురి చేరిక

మోమిన్‌పేట: ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో పలువురు చేరారు. మండల పరిధి ఎన్కేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మొగులయ్య కుమారుడు శ్రీకాంత్‌తో పాటు పలువురు గులాబీ కండువా కప్పుకొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఇందులో నాయకులు బాబుమియా, మల్లయ్య, మైపాల్‌రెడ్డి, మండల యువత అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మైబల్లి, శోభన్ ఉన్నారు.

మోసపోవద్దు..

కొడంగల్: నియోజకవర్గ పరిధి పలు గ్రామాలకు చెందిన యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ మాటలు విని మోసపోవద్దని సూచించారు.



యాలాల: ఇంటింటి ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు

రోహిత్‌కే మద్దతు

తాండూరు టౌన్: తాండూరు అభివృద్ధికి పాటుపడిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని లారీ ఓనర్స్, డ్రైవర్స్, గూడ్స్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అన్నారు. స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నియోజకవర్గ కన్వీనర్ గోపాల్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తాండూరులో రవాణా రంగం అభివృద్ధి కోసం అంతారం గడ్డపై లారీ పార్కింగ్ నిర్మాణం, జినుగుర్తి వద్ద ఇండస్ట్రియల్ పార్కు, తాండూరు ఔటర్ రింగ్ రోడ్డు వంటి నిర్మాణాలు చేపడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఇందులో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ గని, నరసింహారెడ్డి, గూడ్స్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ మోయిజ్, కోశాధికారి మహ్మద్ యాసిన్ ఉన్నారు.



అభివాదం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అవినీతి నిర్మూలనపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

మొయినాబాద్: నేటి విద్యార్థులే.. రేపటి పౌరులని.. దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో అవినీతి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పేదరిక నిర్మూలన జరగాలంటే జీరో కరప్షన్ సిస్టమ్ రావాలన్నారు. అలాగే, పరిపాలనలో పారదర్శకత పెరగాలన్నారు. దానికి విద్యార్థి దశ నుంచే పునాదులు పడాలని సూచించారు. ఇండియా అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితా నుంచి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి చేరాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ జ్యోతిక, అధ్యాపకులు స్వేత, దీప్తి, సురేష్, స్రవంతి, కనకారావు, రమేష్, రాజేంద్రరెడ్డి, నందకిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.